జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు


తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు


ఎడిటర్ : 90520 45435

బుధవారం 14-01-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :228 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : కాసే అమృత


## ప్రతి కుక్క కాటుకు..

### భారీ జరిమానా: రాష్ట్రాలకు సుప్రీంకోర్టు హెచ్చరిక





దిల్లీ: వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోతే ఆయా రాష్ట్రాలపై భారీ జరిమానాలు వేస్తామని హెచ్చరించింది. ప్రతి కుక్క కాటు కు పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టంచేసింది. పేజి 2లో ▶

## ఇరాన్‌లో ఆందోళనలు: వందలు కాదు..




ఇరాన్‌లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనల్లో భారీ సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఆరు వందల మందికి పైగా చనిపోయినట్లు అధికారిక సమాచారం రాగా..

2లో

## సార్లంకపల్లె అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉండాలి:

### సీఎం చంద్రబాబు ఆదేశం

- నగదు సాయం: ప్రమాదంలో సర్వం కోల్పోయిన ప్రతి కుటుంబానికి తక్షణ సాయంగా ?25,000 నగదు అందజేస్తున్నారు.
- కొత్త ఇళ్లు: ఇళ్లు కోల్పోయిన 38 కుటుంబాలకు శాశ్వత ప్రాతిపదికన కొత్త ఇళ్లను మంజూరు చేయాలని సీఎం ఆదేశించారు.
- తాత్కాలిక వసతి: ఇళ్లు పూర్తయ్యే వరకు బాధితులకు అవసరమైన వసతి, భోజన సదుపాయాలు మరియు ఇతర నిత్యావసరాలను అందించాలని స్పష్టం చేశారు.



2లో

## 18న మేడారం తరలి వస్తున్న ప్రభుత్వం

**అభివృద్ధి పనులకు సిఎం చేతులమీదుగా ప్రారంభం**

**అదేరోజు కేబినేట్ భేటీ కూడా ఇక్కడే ఏర్పాటు**

**ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క**





మేడారంలో జరుగుతున్న సమ్మక్క–సారలమ్మ జాతర ఏర్పాట్లను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పరిశీలించారు. జాతర పనులు తుది దశకు చేరుకున్నాయని ఆమె వెల్లడించారు. ఆ తల్లుల దర్శనం కోసం అన్నివర్గాల ప్రజలు ఈ జాతరకు తరలివస్తారన్నారు. దాదాపు రెండు కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని సీతక్క చెప్పారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామని వివరించారు. మేడారం భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందన్నారు. సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డికి.. సమ్మక్క సారలమ్మ తల్లులతో ఎంతో భావోద్వేగ బంధం ఉందని గుర్తుచేశారు. అందుకే రూ.260 కోట్లతో మేడారం అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పుకొచ్చారు. జనవరి 18న మేడారంలో దేవాలయాన్ని ప్రారంభించేందుకు సీఎం విచ్చేయనున్నారని తెలిపారు. ఇక్కడే కేబినెట్ సమావేశం సైతం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అంటే.. ఆ రోజు రాష్ట్ర ప్రభుత్వమే మేడారంనకు తరలి వస్తుందన్నారు. మేడారం వచ్చే భక్తులకు త్వరితగతిన అమ్మవార్ల దర్శనం జరిగేలా చర్యలు తీసుకోవాలని దేవాలయ అధికారులను ఆదేశించారు సీతక్క. కనీసం మూడు రోజుల పాటు సంప్రదాయ భక్తులు మేడారంలోనే బస చేస్తారని వివరించారు. అందుకు వారికి అవసరమైన వసతులను కల్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రవాణా, తాగునీరు, శానిటేషన్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారామె. అలాగే.. ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు స్పష్టం చేశారు మంత్రి. సామాన్య భక్తులు ఆర్టీసీ బస్సుల్లో తరలివస్తారని.. ఈ మార్గంలో నడిచే బస్సుల పర్యవేక్షణ ఉండాలని ఆర్టీసీ సంస్థ ఉన్నతాధికారులకు సూచించారు.

## ఆ రెండు కేసుల విచారణకు.. సజ్జనార్ నేతృత్వంలో సిట్




హైదరాబాద్: నారాయణపేట జిల్లా మద్దూర్, హైదరాబాద్ సీసీఎస్‌లో నమోదైన కేసులపై విచారణకు తెలంగాణ ప్రభుత్వం సిట్ ఏర్పాటుచేసింది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో 8 మందితో సిట్ ఏర్పాటు చేస్తూ డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కావలి వెంకటేశ్ అనే వ్యక్తి సీఎం ఫొటోలను అసభ్యకరంగా రూపొందించి వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేశాడు. దీనిపై కాంగ్రెస్ నేత గూళ్ల నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 11న కేసు నమోదైంది.

తాజాగా మహిళా ఐఏఎస్‌ను కించపరుస్తూ వార్తలను ప్రచారం చేయడంపై సీసీఎస్‌లో కేసు నమోదు చేశారు.

పేజి 2లో ▶

## కేటీఆర్‌కు మరో అరుదైన గౌరవం.. కొలంబియా బిజినెస్ స్కూల్‌లో ప్రసంగించాలని ఆహ్వానం



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. బీఆర్ఎస్ హయాంలో మంత్రిగా ఆయన చేసిన అసాధారణ కృషిని, తెలంగాణను ప్రపంచపటంలో సమున్నత స్థాయిలో నిలిపిన తీరును గుర్తిస్తూ.. అంతర్జాతీయ వేదికలపై ఆయన ఆలోచనలను పంచుకోవాల్సిందిగా ఆహ్వానం అందింది. సాంకేతికత, పాలన, సుస్థిర అభివృద్ధి, పట్టణ అభివృద్ధి, ఆర్థిక వృద్ధిపై ఆయనకు ఉన్న లోతైన అవగాహన ప్రపంచవ్యాప్తంగా విద్యా, విధాన నిర్ణేత, వ్యాపార వేదికలపై బలమైన ముద్ర వేసింది.ఈ క్రమంలో న్యూయార్క్ నగరంలోని కొలంబియా బిజినెస్ స్కూల్ లో 2026 ఏప్రిల్ 4న జరగనున్న '21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ లో ప్రసంగించాలని కేటీఆర్‌కు ఆహ్వానం అందించింది.ఈ సదస్సును నిర్వహించే విద్యార్థి విభాగం 'సౌత్ ఆసియా బిజినెస్ అసోసియేషన్ ఈ మేరకు ఆయనను ఆహ్వానించింది. భారతదేశ వ్యాపార, ఆవిష్కరణ, విధాన నిర్ణయ రంగాలపై మేధోమధనం జరిగే ప్రపంచంలోని అత్యున్నత వేదికలలో 'ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ ఒకటి.

## కుంభమేళాకు మించి సమ్మక్క-సారలమ్మ జాతర

- రూ.250 కోట్లకుపైగా నిధులతో పనులు
- సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణ
- మేడారం జాతర ఏర్పాట్లపై మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క




2లో

## 'వీబీ జీరామ్ జీ'తో ఉపాధి కూలీల ఆదాయం రెట్టింపు: బండి సంజయ్



కరీంనగర్: 'వీబీ జీరామ్ జీ' పథకంతో ఉపాధి కూలీల ఆదాయం రెట్టింపు అవుతుందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. "ఈ పథకం ద్వారా ఏడాదికి 200 రోజుల ఉపాధి దొరుకుతుంది. పనుల విషయంలో కేంద్రం జోక్యం ఉండదు. ఈ పథకం కోసం గతంలో కంటే అదనంగా రూ.17 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. తెలంగాణలో ఈ పథకం అమలుకు అదనంగా రూ.340 కోట్లు ఇవ్వబోతున్నాం. రైతులకు న్యాయం చేసేలా దీన్ని తీసుకొచ్చాం. వ్యవసాయ సీజన్‌లో ఈ పథకం పనులు జరగవు. దీంతో కూలీలు అందుబాటులో ఉంటారు" అని తెలిపారు.

## ఘనంగా అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ ప్రారంభం



2లో

## విజయవాడలో కారు బీభత్సం కేసు.. రౌడీషీటర్లు అరెస్ట్



2లో

విజయవాడ: మద్యం మత్తులో బబ్బూరి గ్రౌండ్స్ వద్ద కారును నిర్లక్ష్యంగా, అతివేగంగా నడిపి బీభత్సం సృష్టించిన ఘటనలో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

# సంపాదకీయం

## సిద్ధ శివ కలహా కర్ణాటకం

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవికై కుమ్ములాటలు జరుగుతున్నాయి. తాను నిర్వహిస్తున్న ఆ ఉన్నత పదవిని నిలుపుకునేందుకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆ పదవిని ఆకాంక్షస్తున్న ఉప ముఖ్యమంత్రి డి.కె శివకుమార్ మధ్య పెరిగిపోతున్న విభేదాల గురించి ఇటీవలి వారాలలో కర్ణాటకలోని వార్తాపత్రికలు అన్నీ పుంఖానుపుంఖాలుగా వార్తలు ప్రచురించాయి. 2023 మేలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినపుడు-- సిద్ధరామయ్య మొదటి రెండు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉంటారని, ఆ తరువాత డి.కె. శివకుమార్ ఆ పదవిలోకి వస్తారని కాంగ్రెస్ అధిష్ఠానవర్గం చెప్పినట్టు ఉప ముఖ్యమంత్రి అనుయాయులు గట్టిగా గుర్తు చేస్తున్నారు. ఈ వాదనతో సిద్ధరామయ్య మద్దతుదారులు ఏకీభవించడం లేదు. రెండున్నర సంవత్సరాల గడువు ముగిసిపోయింది. అయినా కాంగ్రెస్ జాతీయ నాయకత్వం మౌనంగా ఉండిపోగా బెంగళూరులో ఉదయం ఉపాహార, మధ్యాహ్న భోజన, రాత్రి విందు సమావేశాలు జోరుగా జరుగుతున్నాయి. శాసనసభ్యుల, కుల సంఘాల నాయకుల మద్దతును తమకు అనుకూలంగా కూడగట్టుకునేందుకు ప్రధాన నాయకులు ఇరువురూ ప్రయత్నిస్తున్నారు.

నాయకత్వ వివాదాన్ని దాటి కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు మొత్తంగా ఎలా ఉందనే విషయాన్ని నిశితంగా పరిశీలించేందుకు ఈ కాలమ్‌ను ఉద్దేశించాను. గత శాసనసభ ఎన్నికల ముందు నెలల్లో కర్ణాటకలో పరిస్థితులు ఎలా ఉన్నాయో తొలుత గుర్తు చేసుకుందాం. అప్పట్లో మీడియాలో అజాన్, హిజాబ్, హలాల్, లవ్ జిహాద్ తదితర అంశాలపై వార్తలే ఎక్కువగా ఉండేవి. అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఎప్పటిలాగానే ప్రజల్లో మతపరమైన విభేదాలను రెచ్చగొట్టడం ద్వారా అధికారాన్ని మళ్లీ కైవసం చేసుకునేందుకు ఆరాటపడింది.

తమ పాలన తీరుతెన్నులను ప్రజలు హర్షించడంలేదన్న వాస్తవాన్ని గుర్తించి, ముస్లింల పట్ల వ్యతిరేకతను రెచ్చగొట్టడం ద్వారా హిందువులలో మద్దతును కూడగట్టుకుని ఎన్నికలలో విజయం సాధించేందుకు ప్రయత్నించింది. కర్ణాటక అదృష్టం బాగుండి బీజేపీ వ్యూహం విఫలమయింది. కాంగ్రెస్ మంచి మెజారిటీతో విజయం సాధించింది. సిద్ధరామయ్య ముఖ్యమంత్రి అయ్యారు. మతతత్వ ఉద్రిక్తతలను గణనీయంగా తగ్గించడంలో ఆయన ప్రభుత్వం సఫలమయిది. కర్ణాటక జనాభాలో ముస్లింలు 13 శాతం మేరకు ఉన్నారు. క్రైస్తవులు కూడా చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్నారు. ఈ రెండు మైనారిటీ మత వర్గాల వారు మే 2023 నుంచి, అంతకు ముందు నెలలు, సంవత్సరాలలో కంటే నిశ్చిత భద్రతాభావంతో మనుగడ సాగిస్తున్నారని నిస్సందేహంగా చెప్పవచ్చు.

కర్ణాటకలో కాంగ్రెస్‌ను అధికారానికి తీసుకువచ్చిన అంశాల్లో ముఖ్యమైనవి ఐదు హామీలు: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం; గృహిణులకు నగదు బదిలీలు; ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, అదనపు ఆహార ధాన్యాలు; విద్యావంతులు అయిన నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి. సిద్ధరామయ్య ప్రభుత్వం ఈ హామీలను ఏ మేరకు నెరవేర్చింది? ఈ విషయమై సాధికారికమైన అధ్యయనాలు జరగలేదు. అయితే ఆ హామీ పథకాలు చెప్పుకోదగిన విధంగా విజయవంతమయ్యాయని, లక్షలాది కుటుంబాలకు సామాజిక భద్రత సమకూరిందని స్వతంత్ర పరిశీలకులు ఘంటాపథంగా సూచిస్తున్నారు.

మత సామరస్యం, లక్ష్యిత సంక్షమం అనేవి సిద్ధరామయ్య ప్రభుత్వ విజయాలు అనడంలో సందేహం లేదు. 31 నెలల కాంగ్రెస్ పాలన సాధించిన మరేవైనా విజయాల గురించి చెప్పడం అసాధ్యం కాకపోయినప్పటికీ, కష్టమే. పరిపాలనా పరమైన ఉదాసీనత, అసమర్థత ముఖ్యంగా రాష్ట్ర రాజధాని బెంగళూరులో కనిపిస్తున్నాయి. అధ్వానమైన రోడ్ల పరిస్థితులు, తరచూ ట్రాఫిక్‌జామ్‌లు నగరవాసులకు నరకాన్ని చవి చూపిస్తున్నాయి. భారత్‌లో ఐటీ విప్లవానికి మారుపేరుగా ఉన్న బెంగళూరు నగరంలో ప్రగతి స్తంభించిపోయిందని, మౌలిక సదుపాయాలు క్షణించిపోతున్నాయని జాతీయ, అంతర్జాతీయ మీడియాలో వ్యాసాలు అనేకం వెలువడ్డాయి. ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతుండడంతో బెంగళూరు ఇన్‌చార్జి మంత్రి కూడా అయిన ఉపముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ అంతర్జాతీయ విమానాశ్రయమున్న నగర ఉత్తరప్రాంతం, సాఫ్ట్‌వేర్, బయోటెక్ కంపెనీలు ఉన్న దక్షణ ప్రాంతం మధ్య ఒక సొరంగ మార్గాన్ని నిర్మించాలని ప్రతిపాదించారు. దీనివల్ల ఇంజినీర్లు తదితర వృత్తి నిపుణులు, వైట్‌కాలర్ ఉద్యోగుల సులభ ప్రయాణాలకు సౌలభ్యమేర్పడడంతో పాటు నగర పౌరులకు ఇతోధిక మేలు జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి విశ్వసిస్తున్నారు. అయితే ప్రభుత్వ కార్యక్రమాలలో దేనినైనా 'తెల్ల ఏనుగు' (ప్రభుత్వానికి ఆర్థిక గుదిబండ, ప్రజలకు అల్ప ప్రయోజనమూ కలిగించేది) అని వర్ణించవలసింది ఏదైనా ఉంటే అది ఈ టన్నెల్ ప్రాజెక్టేనని చెప్పితీరాలి.

రవాణా రంగ అగ్రగామి భారతీయ నిపుణులు భారత్ ఉద్దండులు అయిన రవాణా నిపుణులు బెంగళూరులోని సుప్రసిద్ధ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఉన్నారు. ఉపముఖ్యమంత్రి ప్రతిపాదించిన సొరంగమార్గం ప్రణాళిక వివేకవంతమైనది కాదని, అది ఆచరణమోగ్యం కాదని ఆ నిపుణులు స్పష్టం చేశారు. నగర భూగర్భం చాలా సంక్లిష్టమైనది కావడంతో పాటు ప్రతిపాదిత సొరంగ మార్గం ప్రైవేట్ వాహనాల యజమానులకే ఎక్కువ అనుకూలంగా ఉన్నందున ఆ టన్నెల్ ప్రాజెక్టును చేపట్టక పోవడమే మంచిదని వారు గట్టిగా చెప్పారు. నగర రవాణా సమస్యలకు సరైన పరిష్కారం సిటీ బస్సుల సంఖ్యను ఇతోధికంగా పెంచి ప్రస్తుతమున్న మెట్రో వ్యవస్థతో దానిని సమన్వయం చేయడమేనని ఐఐఎస్ నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ప్రతిస్పందన ఏమిటి? ఆ నిపుణులతో చర్చించడం కాదు కదా. వారితో సమావేశమవడానికి సైతం ఉప ముఖ్యమంత్రి శివకుమార్ నిరాకరించారు. తాను ప్రతిపాదించిన ప్రాజెక్టును అమలుపరిచేందుకే ఆయన కృతనిశ్చయంతో ఉన్నారు. దానివల్ల ప్రభుత్వ ఖజానాపై చాలా భారం పడుతుందన్న వాస్తవాన్ని ఆయన పూర్తిగా ఉపేక్షస్తున్నారు!

శివకుమార్ రాజకీయాలలో ఆకాంక్ష తత్వం, తొందరపాటు స్పష్టంగా కనిపిస్తాయి. ఇదిలావుండగా ఆత్మ విశ్వాసంతో సదా ప్రశాంతంగా ఉండే రాజకీయవేత్త అయిన సిద్ధరామయ్య తన పదవిని నిలబెట్టుకునేందుకే అధిక ప్రాధాన్యమిస్తున్నట్టుగా కనిపిస్తున్నది. ప్రజాబలం మెండుగా ఉన్న నాయకుడు ఆయన. కర్ణాటక చరిత్రలో అత్యధిక కాలం అధికారంలో ఉన్న మొదటి ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య గణుతికెక్కారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మధ్య అధికార కుమ్ములాటలు పాలనా వ్యవహారాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయి. పాలనాదక్షులు అయిన కేబినెట్ మంత్రులు పలువురు ఉన్నప్పటికీ ప్రధాన నాయకుల మధ్య వివాదాల మూలంగా వారూ తమ తమ మంత్రిత్వ శాఖల విధులపై దృష్టిని కేంద్రీకరించలేక పోతున్నారు.

కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం అసమర్థత మూలంగా కర్ణాటకలో ఆ పార్టీ సమస్యలు మరింతగా మిక్కుటమవుతున్నాయి. కాంగ్రెస్‌లో అనేక అధికార కేంద్రాలు ఉండడమే ఇందుకు కారణం. కర్ణాటకకు చెందిన మల్లికార్జున్ ఖర్గే కాంగ్రెస్ అధ్యక్షుడు. రాష్ట్ర ముఖ్యమంత్రి పదవీ వివాదం పరిష్కారంలో పార్టీ హైకమాండ్ వైఖరిని నిర్ణయాత్మకంగా ప్రభావితం చేయగల స్థానంలో ఆయన ఉన్నారు. అయితే ఆయన సోనియా, రాహుల్ పట్ల అమిత గౌరవ విధేయతలతో వ్యవహరించే నాయకుడు. దీనికి తోడు ప్రియాంకగాంధీ కూడా కర్ణాటక వ్యవహారాలలో ఆసక్తి చూపుతున్నట్టుగా కనిపిస్తోంది. ఈ కారణంగా ఏఐసీసీలో నాలుగు విభిన్న అధికార కేంద్రాలు ఉన్నాయి. సిద్ధరామయ్య, శివకుమార్‌ల మద్దతుదారులు ఆ నలుగురికీ తమ వాదనలు వినిపించవలసి ఉంటుంది. మరి రాష్ట్ర కాంగ్రెస్ సమస్యలు మరింతగా సంక్లిష్టమై పోవడంలో ఆశ్చర్యమేముంది?

స్థానిక దినపత్రికలలో వెలువడుతున్న వార్తలను పరిశీలిస్తే, కర్ణాటక ప్రస్తుత వర్తమాన అభ్యుదయానికి, భావి ప్రగతికి ఎంతో ముఖ్యమైన విషయాలకు తగు ప్రాధాన్యం లభించడమే లేదు. మీడియా శ్రద్ధాసక్తులు ఎంతకూ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మధ్య నడుస్తున్న పదవీ వివాదం మీదే ఉంటున్నాయి. ఆ మాటకు వస్తే ఈ ఇద్దరు ప్రధాన నాయకులు తమ అధికార పెనుగులాటపై మినహా మరే ప్రజాసంబంధిత విషయమై రవ్వంత శ్రద్ధ చూపడం లేదని కొన్నిసార్లు అనిపిస్తున్నది. కర్ణాటక పురోగతి విషయమై సిద్ధరామయ్యకు ఒకప్పుడు ప్రగతిశీల దార్శనికత ఉండేది. ఇప్పుడు ఆయన పాలనలో అటువంటిదేమీ కనిపించడం లేదు.

## సార్లంకపల్లె అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉండాలి:

మొదటి పేజీ తరువాయి

అమరావతి: కాకినాడ జిల్లా సార్లంకపల్లెలో జరిగిన అగ్నిప్రమాదంపై మంత్రులు, అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సంక్రాంతి పండుగ సమయంలో ఈ అగ్నిప్రమాదం విషాదాన్ని తెచ్చిందన్నారు. గ్రామంలో ఉన్న 38 తాటాకు ఇళ్లు కాలిపోయాయని.. బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు.

బాధిత కుటుంబాలకు అందిస్తున్న సాయాన్ని హోంమంత్రి అనిత, ఇతర అధికారులు ఆయనకు వివరించారు. తక్షణసాయంగా ఒక్కో కుటుంబానికి రూ.25వేల నగదు అందజేస్తున్నామని తెలిపారు. ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి కొత్త ఇల్లు మంజూరు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. అప్పటివరకు వారికి అవసరమైన వసతి, ఇతర సహాయం అందించాలన్నారు. ప్రమాదంలో కాలిపోయిన డాక్యుమెంట్లు, ఆధార్ కార్డులు ఇచ్చేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు అందే సాయంపై మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షంచాలని సూచించారు.

## ఇరాన్‌లో ఆందోళనలు: వందలు కాదు..

మొదటి పేజీ తరువాయి

ఈ సంఖ్య రెండు వేల వరకు ఉండొచ్చని ఇరాన్ అధికారులు సంకేతాలిచ్చారు. అక్కడ పెరుగుతోన్న హింస చాలా భయపెడుతోందని ఐరాస మానవ హక్కుల సంఘం కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో ఇరాన్‌కు చెందిన వెబ్‌సైట్ మాత్రం ఇటీవల ఆందోళనల్లో పది వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు సంచలన కథనంలో పేర్కొంది.

కనీవినీ ఎరుగని హింస..!

దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనల్లో పౌరులతో పాటు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు ఓ అంతర్జాతీయ మీడియా సంస్థతో ఇరాన్ అధికారులు వెల్లడించారు. ఈ మరణాల వెనక ఉగ్రవాదులు ఉన్నారని ఆరోపించారు. మరోవైపు ఇటీవల ఘర్షణల్లో 12 వేల మంది చనిపోయినట్లు 'ఇరాన్ ఇంటర్నేషనల్' కథనం పేర్కొంది. భద్రతా సంస్థలు, అధ్యక్ష కార్యాలయం, ప్రత్యక్ష సాక్షులు, వైద్యాధికారులు.. తదితర వర్గాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ అంచనా వేసినట్లు తెలిపింది. జనవరి 8, 9 తేదీల్లోనే ఈ మరణాలు చోటుచేసుకున్నాయని, ఓ ప్రణాళిక ప్రకారమే ఈ హింసాత్మక ఘటనలు జరిగాయని వెల్లడించింది. ఆధునిక ఇరాన్ చరిత్రలో ఈ తరహా హింస ఎన్నడూ చోటుచేసుకోలేదని పేర్కొంది.

మరణశిక్ష భయం..?

దేశవ్యాప్తంగా 31 ప్రావిన్సుల్లో 600లకుపైగా ప్రదేశాల్లో నిరసనలు కొనసాగినట్లు అమెరికా కేంద్రంగా నడిచే మానవ హక్కుల కార్యకర్తల వార్తా సంస్థ పేర్కొంది. వందలాది మంది మృతి చెందగా, 10వేలకు పైగా నిరసనకారులను అక్కడి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపింది. అయితే, ఈ భయంకరమైన హింసాత్మక ఘటనలు ఇలాగే కొనసాగితే చాలా కష్టమని.. ఇరాన్ పౌరుల న్యాయమైన డిమాండ్లను తప్పక వినాల్సిందేనని ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ పేర్కొంది. మరణాలు వందల సంఖ్యలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని ఆ సంస్థ అధికార ప్రతినిధి జెరెమీ లారెన్స్ పేర్కొన్నారు. అంతేకాదు.. అరెస్టైన వారిలో అనేక మందికి మరణశిక్ష పడవచ్చనే ఆందోళన వ్యక్తం చేశారు.

## విజయవాడలో కారు బీభత్సం కేసు.. రౌడీషీటర్లు అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

సీసీ కెమెరాల ఆధారంగా నిందితులు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు. కరుడుగట్టిన పాత నేరస్థులు, రౌడీ షీటర్లు.. కొండా యోహావా అలియాస్ పెద్ద చిచ్చా, కొండా రమేష్ అలియాస్ చిన్న చిచ్చా, వీర్ల భార్గవ్‌లను అదుపులోకి తీసుకున్నామని నగర ఏడీసీపీ రామకృష్ణ తెలిపారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్టు చెప్పారు.

పెద్ద చిచ్చాపై 18 కేసులు, చిన్న చిచ్చాపై 42 కేసులు ఉన్నాయన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రిపేరు నిమిత్తం షెడ్డుకు వచ్చిన కారును వీరు.. జల్సాలకు వాడారన్నారు. రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందని ఏడీసీపీ తెలిపారు. ఆదివారం సాయంత్రం రౌడీషీటర్ల ర్యాష్ డ్రైవింగ్ కారణంగా పఠాన్ రిహాన్‌ఖాన్(10), మీడియా విలేకరి నాగేంద్ర, మరో ఇద్దరు గాయపడిన విషయం తెలిసిందే.

## ఆ రెండు కేసుల విచారణకు.. సజ్జనార్ నేతృత్వంలో సిట్

మొదటి పేజీ తరువాయి

ఐఏఎస్ అధికారుల సంఘం ఫిర్యాదు మేరకు రెండు తెలుగు న్యూస్ ఛానళ్లతో పాటు ఏడు యూట్యూబ్ ఛానళ్లపై బీఎన్ఎస్ 75, 78, 79, 351(1), 351(2) సెక్షన్ల కింద కేసులు పెట్టారు. ఈ రెండు కేసుల వ్యవహారంపై సిట్ దర్యాప్తు చేయనుంది. సిట్‌లో సభ్యులుగా నార్త్ రేంజ్ జాయింట్ సీపీ శ్వేత, చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్, హైదరాబాద్ అడ్మిన్ డీసీపీ వెంకటలక్ష్మి, సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, విజిలెన్స్ అదనపు ఎస్పీ ప్రతాప్, సీసీఎస్ ఏసీపీ గురు రాఘవేంద్ర, సైబర్‌సెల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రెడ్డి, సైబర్‌సెల్ ఎస్సై హరీశ్ ఉన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: సంక్రాంతి పండగ సందర్భంగా పర్యాటక, సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన 7వ అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ ఘనంగా ప్రారంభమైంది. ఇవాళ్టి నుంచి ఈనెల 15 వరకు నిర్వహించే ఫెస్టివల్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. స్వీట్ ఫెస్టివల్‌లో భాగంగా జాతీయ, అంతర్జాతీయ మిఠాయిలు, తెలంగాణ పిండి వంటలతో కూడిన 60 స్టాళ్లు అందుబాటులో ఉన్నాయి. 120 హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్స్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లైయర్స్, 15 రాష్ట్రాల నుంచి 55 దేశవాళీ కైట్ క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు. ఫెస్టివల్‌లో వీక్షకులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నారు. ఈనెల 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ జరగనుంది.

## 18న మేడారం తరలి వస్తున్న ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

సమ్మక్క సారలమ్మ మహా మేడారం జాతరను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే అన్ని చర్యలు పూర్తి చేశామని మంత్రి సీతక్క వివరించారు. మేడారం జాతర అధికారిక వెబ్‌సైట్‌ను మంత్రి సీతక్క ప్రారంభించారు. అలాగే.. మేడారం వాట్సప్ చాట్ బాత్‌తోపాటు మొబైల్ యాప్‌నూ విడుదల చేశారు. వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో హెల్త్ క్యాంప్, టాయిలెట్ బాక్సులు, రూట్ మ్యాప్‌లు, ట్రాఫిక్ అప్‌డేట్‌లు, సహాయ కేంద్రాల ఫోన్ నంబర్లు, ఫిర్యాదుల నమోదుకు ప్రత్యేక వ్యవస్థ, నీటి సౌకర్యం తదితర అన్ని సౌకర్యాల సమాచారం కోసం వాట్సాప్ నంబర్ 7658912300 అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆమె వివరించారు.

## ప్రతి కుక్క కాటుకు..

మొదటి పేజీ తరువాయి

కుక్క కరిచిన ప్రభావం బాధిత వ్యక్తిపై జీవితకాలం ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఈ సందర్భంగా వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న వారిపైనా కోర్టు అసహనం వ్యక్తం చేసింది. "ఏదైనా సంస్థ ఆహారం పెడుతున్న కుక్కల దాడిలో ఓ చిన్నారి మరణిస్తే.. అప్పుడు ఎవరిని బాధ్యుల్ని చేయాలి? ఆ ప్రాణనష్టానికి సదరు సంస్థ బాధ్యత వహించదా? వీధి కుక్కల బెడదను నివారించేందుకు రాష్ట్రాలు తగిన చర్యలు చేపట్టాలి. లేదంటే ప్రతి కుక్క కాటుకు, కుక్కల దాడిలో జరిగిన ప్రతి మరణానికి గానూ ఆయా రాష్ట్రాలపై మేం నిర్దేశించిన భారీ పరిహారాలను చెల్లించాలి" అని న్యాయస్థానం స్పష్టం చేసింది.

పాతికేళ్లు పూర్తయ్యాయా.. మీ శిక్షకాలాన్ని ఎలా లెక్కిస్తున్నారు?

ఇక, వీధికుక్కలకు ఆహారం పెట్టే వారి గురించి మాట్లాడుతూ.. "మీకు శునకాలపై అంత ప్రేమ ఉంటే.. వాటిని మీ ఇంటికి తీసుకెళ్లి పెంచుకోండి. వీధి కుక్కల సమస్య భావోద్వేగభరిత అంశమని అంటున్నారు. మీ భావోద్వేగం కేవలం కుక్కల పైన మాత్రమేనా? మేం మనుషుల గురించి కూడా సమానంగా ఆందోళన చెందుతున్నాం. కుక్కలు వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయపెట్టే పరిస్థితిని మేం ఆమోదించబోం" అని ధర్మాసనం వెల్లడించింది.

దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది నవంబరులో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపంలోని వాటిని షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. ఈ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

## నారావారి పల్లెలో సంక్రాంతి సంబరాలు

మొదటి పేజీ తరువాయి

ఈ కార్యక్రమంలో నారా దేవాన్ష్ పలు పోటీల్లో పాల్గొని ఆకట్టుకున్నారు.పరదాల సంస్కృతికి పూర్తిగా భిన్నంగా, సొంతూరు నారావారిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. క్రీడా పోటీల అనంతరం ఇంటికి వెళ్లే మార్గమంతా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ముఖ్యమంత్రి స్వయంగా తమ అర్జీలు స్వీకరించడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. చుట్టు పక్కల జిల్లాల నుంచి ప్రత్యేకంగా తరలివచ్చిన ప్రజలు కూడా చంద్రబాబుకు అర్జీలు అందజేశారు. సమస్యలు విన్న సీఎం చంద్రబాబు అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచింది.గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ, ప్రజల అర్జీలను స్వయంగా స్వీకరించడం వంటి చర్యలు చంద్రబాబు ప్రజాపాలనకు నిదర్శనంగా నిలిచాయి. నారావారిపల్లెలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానికంగా విశేష ఆదరణ లభించింది. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలను భువనేశ్వరి, బ్రాహ్మణి పరిశీలించారు. సంబరాల్లో భాగంగా ఏర్పాటుచేసిన వివిధ క్రీడా పోటీల్లో దేవాంశ్ పాల్గొన్నాడు. ఆయా పోటీలను సీఎం, కుటుంబసభ్యులు తిలకించారు. అనంతరం విజేతలకు చంద్రబాబు, భువనేశ్వరి బహుమతులు అందజేశారు. అంతకుముందు ప్రజల నుంచి వినతిపత్రాలను సీఎం స్వీకరించారు.

## కుంభమేళాకు మించి సమ్మక్క-సారలమ్మ జాతర

మొదటి పేజీ తరువాయి

ఈనెల 28వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఈసారి గతంకన్నా రెట్టింపు సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రభుత్వంలోని వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్షణ్ కుమార్, దనసరి అనసూయలు అన్నారు. మేడారం జాతరపై డా. బీ.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమిక్ష సమావేశంలో మంత్రులు,అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సభ్యసాచి ఘోష్, అడిషనల్ డీజీలు విజయ్ కుమార్, స్వాతి లక్రా, వివిధ శాఖ కార్యదర్శులు, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ మాట్లాడుతూ, గత 2024 మేడారం జాతరకు కోటిన్నర మంది హాజరుకాగా, ఈసారి 2026 లో జాతరకు దాదాపు గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ. 150 కోట్ల నిధులను మంజూరు చేసి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నందున ఈసారి దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని వివరించారు. సమ్మక్క?సారలమ్మ జాతరను కుంభమేళాకు మించి అద్భుతంగా నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులకు పిలుపునిచ్చారు. ఈ మహాజాతరను విజయవంతంగా నిర్వహించడం ప్రతి అధికారికి ఒక బాధ్యతగా తీసుకుని, ఏ చిన్న లోపం కూడా లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ జాతరకు రూ.150 కోట్లకుపైగా నిధులు కేటాయించి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఈ నిధులతో మౌలిక వసతులు, భద్రత, రవాణా, పారిశుద్ధ్యం, వైద్య సేవలు వంటి అన్ని విభాగాల్లో సమగ్ర ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఏ ఒక్క భక్తుడికి కూడా ఇబ్బంది కలగకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన మంత్రి, జాతరకు వచ్చే భక్తులు సులభంగా గమ్యానికి చేరుకునేలా అన్ని ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాల్లో స్పష్టమైన దిశా సూచిక బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు ఎలాంటి అయోమయానికి గురికాకుండా ట్రాఫిక్ నియంత్రణ పటిష్టంగా ఉండాలని, ప్రత్యేక రూట్ మ్యాప్‌లతో పాటు అవసరమైన చోట వన్‌వే వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. ఈ జాతరపై క్యాబినెట్ మొత్తం ప్రత్యేక దృష్టి సారించిందని, మంత్రులందరూ సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇలాంటి స్థాయి సమిష్టి పర్యవేక్షణ గతంలో ఎప్పుడూ జరగలేదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా వసతి, పార్కింగ్, రవాణా సౌకర్యాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ విషయంలో వీఐపీలు,సామాన్య భక్తులు అనే తేడా లేకుండా, అందరికీ సమాన సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు.

రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఈసారి జాతర ఏర్పాట్లకు రూ. 150 కోట్లతో పాటు గ్ద్దెల పునరుద్ధరణ పనులకు రూ. 101 కోట్లు మొత్తం 251 కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేశారని వివరించారు. జాతరకు వచ్చే ప్రతీ భక్తులకు సాఫీగా దర్శనం లభించేలా ప్రాధాన్యత నిస్తున్నట్టు అన్నారు. ఇందుకు గాను ప్రతీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో వివిధ శాఖ కార్యదర్సులు, హెచ్.ఓ.డీ లతో ప్రత్యేకంగా వాట్స్-అప్ గ్రూప్ ను ఏర్పాటు చేసి జాతర నిర్వహణపై ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సీతక్క సూచించారు. శానిటేషన్, తాగునీరు, రవాణా, భద్రతాలపై ప్రత్యేకంగా ద్రుష్టి సారించాలని, ప్రధానంగా టాయిలెట్ లను మరింత పెంచాలని కోరారు. జాతర సందర్భంగా గురు, శుక్ర వారాల్లోనే ప్రతి రోజు కనీసం 40 లక్షల మంది భక్తులు ఉంటారని, ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. మేడారం జాతరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2010 నుండి ప్రతీ సంవత్సరం వస్తున్నారని, వచ్చే వందేళ్లకు సరిపడా అభివృద్ధి కార్యక్రమాలకు మొట్టమొదటిసారిగా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని సీతక్క గుర్తు చేశారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణ రావు మాట్లాడుతూ, జాతర నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం పర్యవేక్షిస్తున్నందున అన్ని శాఖల ఉన్నతాధికారులు జాతర పనులకు సకాలంలో పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సాధించాలని పేర్కొన్నారు. జాతర సందర్భంగా భక్తులకు చేసిన ఏర్పాట్లు, రవాణా, ఇతర సౌకర్యాలు, భక్తులు పాటించాల్సిన సూచనలపై విస్తృత స్థాయిలో సమాచారాన్ని అందించాలని తెలిపారు. మేడారానికి వచ్చే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణకుగాను డ్రోన్ లను ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా, జాతర సమాచారాన్ని, నియమ నిబంధనలను తెలియచేసే ప్రత్యేక యాప్ ను/ క్యూ.ఆర్ కోడ్ రూపొందించి విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. పార్కింగ్ ఏరియాలలో కూడా ప్రత్యేకంగా వాటర్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. శానిటేషన్, పరిశుభ్రతపై ప్రత్యేక ద్రుష్టి సాధించాలన్నారు. ప్రస్తుతం మేడారంలో జరుగుతున్న జాతర ఏర్పాట్లు, పురోగతి తదితర విషయాలను తెలియచేసే నివేదికను ప్రతీ రోజూ తమకు సమర్పించాలని సంబంధిత శాఖల కార్యదర్శులను కోరారు.

జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348
సందేశ టైమ్స్
నిజం దాగదు – వార్త ఆగదు
14-01-2026

# అగ్రికల్చర్ యూనివర్సిటీ కోసం భూములిచ్చిన రైతులకు కలెక్టర్ కృతజ్ఞతలు

**– భూములు కోల్పోయిన కుటుంబాలకు న్యాయం చేస్తాం -- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సందేశం టైమ్స్: సూర్యాపేట, 13 జనవరి 2026 :** హుజూర్నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ముగ్దం నగర్‌లో ఏర్పాటు చేయనున్న అగ్రికల్చర్ యూనివర్సిటీ కోసం తమ భూములను స్వచ్ఛందంగా ఇచ్చిన రైతులందరికీ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ముగ్దం నగర్‌లో భూములిచ్చిన రైతులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రైతులు మాట్లాడుతూ,



భూములు కోల్పోయిన కుటుంబ సభ్యులకు అర్హత మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, అలాగే ఈ ప్రాంతానికి స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ, అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు వల్ల రైతులకు తక్కువ భూమిలో ఎక్కువ ఆదాయం వచ్చేలా ఆధునాతన వ్యవసాయ పద్ధతులపై శాస్త్రవేత్తల ద్వారా అవగాహన కల్పించవచ్చని తెలిపారు. ఈ యూనివర్సిటీ ద్వారా ఈ ప్రాంతం గణనీయంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. భూములు కోల్పోయిన రైతులందరికీ ప్రభుత్వం ద్వారా న్యాయమైన నష్టపరిహారం చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు. రైతులు కోరిన ఉద్యోగ అవకాశాల అంశాన్ని యూనివర్సిటీ అధికారులతో చర్చిస్తానని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, స్మశాన వాటిక ఏర్పాటు కోసం కూడా తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, కంపాస్ బాక్సులు పంపిణీ చేసి, వారు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు అనూష, రవితేజ, డీటీ నాగేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ ఆలయానికి కుర్చీల బహుకరణ

**సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గం ఇంచార్జి 13 జనవరి**



కౌడిపల్లి మండలం రేణుక ఎల్లమ్మ ఆలయానికి గుమ్ముల జయమ్మ స్వామి కుటుంబ సభ్యులు 20 కుర్చీలను బహుకరించారు. మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించగా, అనంతరం గుమ్ముల జయమ్మ స్వామిని గౌడ సంఘం సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాశమ్మ వెంకటేశం గౌడ్, మల్లేష్ యాదవ్, రంగా గౌని యాద గౌడ్, బిక్షపతి గౌడ్, వెంకటయ్య గౌడ్ తదితరులు, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# హత్నూర మండల రాజకీయాల్లో కొత్త అధ్యాయం -- సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షునిగా చార్ల మణిదీప్ ఏకగ్రీవ ఎన్నిక

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా నియోజకవర్గం ఇంచార్జి 13 జనవరి సంగారెడ్డి జిల్లా**



హత్నూర మండలాన్ని కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా మరింత బలపరిచేలా లింగాపూర్ గ్రామ సర్పంచ్ చార్ల మణిదీప్ గారు హత్నూర మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. లింగాపూర్‌లో సర్పంచ్‌గా ఏకగ్రీవ విజయం సాధించడమే కాకుండా పది వార్డులలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం మణిదీప్ మార్క్ పాలనకు నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. మసాయిపేటలో నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి గారి సమక్షంలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్‌కు చెందిన సర్పంచ్‌లు అందరూ ఏకమై ఆయనను ఫోరమ్ అధ్యక్షునిగా ఎన్నుకోవడం పార్టీ ఆయనపై పెట్టిన విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. పార్టీ కష్టకాలంలోనూ కాంగ్రెస్ కోసం పోరాడిన చార్ల మణయ్య గారి రాజకీయ వారసత్వాన్ని ఆయన తనయుడు మణిదీప్ సమర్థంగా కొనసాగిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా చార్ల మణిదీప్ గారు మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు, తోటి సర్పంచ్‌లకు కృతజ్ఞతలు తెలుపుతూ, హత్నూర మండలంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడానికి అందరితో కలిసి పని చేస్తానని తెలిపారు.

# మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి త్వరలో రాష్ట్ర గవర్నర్

**– పర్యటన ఏర్పాట్లపై అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు**

**(సందేశం టైమ్స్) సూర్యాపేట, 13 జనవరి 2026 :** త్వరలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సూర్యాపేట జిల్లా మఠం పల్లి మండలంలోని ప్రసిద్ధ మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకోనున్న నేపథ్యంలో, గవర్నర్ పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం మట్టపల్లి ఆలయ ప్రాంగణంలో గవర్నర్ రాక ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు,





ధర్మకర్తలు జిల్లా కలెక్టర్‌కు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. గవర్నర్ పర్యటనకు తగిన ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ అధికారులు, ధర్మకర్తలకు జిల్లా కలెక్టర్ సూచించారు. మట్టపల్లి గ్రామపంచాయతీ పరిధిలో రోడ్లు, కాలువలు, నది పరివాహక ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని, రోడ్లపై గుంతలు లేకుండా వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన చోట అప్రోచ్ రోడ్లు నిర్మించాలని, తాగునీటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ప్రత్యేక వైద్యులు, అత్యవసర మందులు, అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పోలీస్ శాఖకు హెలిప్యాడ్, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు అనూష, రవితేజ, అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్ కుమార్, ఈవో జ్యోతి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు జిల్లా కలెక్టర్‌కు వేద ఆశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు.

# బిజిలీపూర్‌లో కొత్త ఆకాశ దీపాల ఏర్పాటు

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 13 జనవరి**



సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పరిధిలోని బిజిలీపూర్ గ్రామంలో సర్పంచ్ చక్రాల నాగమణి నర్సింలు ఆధ్వర్యంలో కొత్త ఆకాశ దీపాలను ఏర్పాటు చేశారు. గత రెండు సంవత్సరాలుగా మరమ్మత్తులకు నోచుకోని పాత దీపాల స్థానంలో తాజాగా అమర్చిన వీధి దీపాల వల్ల గ్రామంలో రాత్రివేళ వెలుగులు పెరిగి ప్రజలకు భద్రత, సౌకర్యం మెరుగుపడిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగమణి నర్సింలు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే తమ లక్ష్యమని, ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని తెలిపారు. మాజీ ఎంపీటీసీ సదానందం ఎన్నికల హామీలను అమలు చేస్తూ గ్రామంలో అవసరమైన పనులను దశలవారీగా చేపడుతున్నామని పేర్కొనగా, ఉప సర్పంచ్ శోభ మచ్చేందర్ ఆకాశ దీపాల ఏర్పాటు భద్రత, సౌకర్యాల దృష్ట్యా ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు షాబుద్దీన్, వార్డ్ మెంబర్లు నందు అశోక్, సుశిల్, మల్లేశం, యాదగిరి, రాజు, పెంటయ్య, జగదీశ్, శ్రీకాంత్‌లతో పాటు పలువురు టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికితీతే సీఎం కప్ లక్ష్యం

**– జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట, 13 జనవరి 2026 (సందేశం టైమ్స్):** గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి పల్లెల నుంచే ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ – – 2025 క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా యువజన సేవలు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ ర్యాలీని జిల్లా ఎస్పీ కే. నరసింహతో కలిసి కలెక్టర్ క్రీడా టార్చ్ వెలిగించి, జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి సంతోష్ బాబు చౌరస్తా మీదుగా సద్దల చెరువు వరకు కొనసాగింది.
ఈ సందర్భంగా నిర్వహించిన సభలో





కలెక్టర్ మాట్లాడుతూ, సీఎం కప్ పోటీల ప్రధాన ఉద్దేశం గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల వరకు క్రీడాకారులకు అవకాశాలు కల్పించడమేనన్నారు.
సీఎం కప్ -- 2025 పోటీలు 44 క్రీడల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.
పోటీల షెడ్యూల్ ఇలా ఉంటుందని వెల్లడించారు:
గ్రామ స్థాయి: జనవరి 17 నుంచి 22 వరకు మండల స్థాయి: జనవరి 28 నుంచి 31 వరకు నియోజకవర్గ స్థాయి: ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు జిల్లా స్థాయి: ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు రాష్ట్ర స్థాయి: ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు జిల్లా యువజన సేవలు, క్రీడల శాఖ, విద్యాశాఖ, మున్సిపల్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో గ్రామాల్లో యువతకు అవగాహన కల్పించి అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.
అర్హత కలిగిన యువత ఝుఞ్ఞ్.వఞ్రీఖఅఞ్జుఖు.ఞ్రశీజ.ఱఅ పోర్టల్ ద్వారా లేదా గూగుల్‌లో "జవీ జబజూ" అని సెర్చ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని యువత తమ ప్రతిభను చాటుకుని బహుమతులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ కే. నరసింహ మాట్లాడుతూ, గ్రామీణ యువతలోని క్రీడా ప్రతిభను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపునిచ్చేందుకు సీఎం కప్ ఎంతో దోహదపడుతుందన్నారు. క్రీడలు శారీరకంగా, మానసికంగా దృఢత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. యువత చదువుతో పాటు ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని, తల్లిదండ్రులు పిల్లలను వారి ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. సీఎం కప్‌లో పాల్గొని బహుమతులు సాధించి సూర్యాపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటరెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, డీఎల్పీఓ నారాయణరెడ్డి, తహసిల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో బాలకృష్ణ, ఎంఈఓ శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బోరంచ గ్రామంలో సంక్రాంతి ఉత్సవాలు: ఘనంగా గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 13 జనవరి**



సంక్రాంతి పండుగ సందర్భంగా నారాయణఖేడ్ నియోజకవర్గం, మానూర్ మండలం పరిధిలోని బోరంచ గ్రామంలో శ్రీ నల్లపోచమ్మ తల్లి గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించబడింది. టోర్నమెంట్ నిర్వహణలో రోషన్ ఎర్త్ మోవర్స్ బి మతీన్, శ్రీ నల్లపోచమ్మ తల్లి టెంట్ హౌస్ బి పండరి, ఎమ్ ఎస్ డి చిట్ ఫండ్స్ జి హనుమంతు, జి.ఆర్ ఎడ్యుకేషనల్ లోన్స్ జి రాజు, ఎమ్ వీ ఎస్ మానూర్ ఎండి ఇస్మాయిల్, బసవంజలి వాటర్ ప్లాంట్ ఎమ్ నాగేష్, ఎమ్ ఆర్. బార్బర్ ఎమ్ లక్ష్మణ్, శ్రీ నల్లపోచమ్మ తల్లి టిఫిన్ సెంటర్ ఎస్ రాజు, శ్రీ రాఘవేంద్ర దాబా ఎస్ సంగారెడ్డి తదితరులు ప్రధానంగా సహకరించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప పాల్గొని టోర్నమెంట్ ప్రారంభం చేశారు. వారి ఆహ్వానంతో, గ్రామస్థులు పెద్ద ఎత్తున హాజరై, వాలీబాల్ మ్యాచ్‌లను ఆసక్తిగా వీక్షించారు. ఈ వేదికలో యువత క్రీడాభిరుచి ప్రదర్శిస్తూ, ఆరోగ్యకరమైన పోటీ భావనతో పాల్గొన్నారు. గ్రామసభా ఆధ్వర్యంలో ఈ విధమైన క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామ యువతను మోటివేట్ చేయడంతో పాటు, స్థానిక సాంఘిక సహకారాన్ని మరింత బలోపేతం చేస్తాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇలాంటి వాలీబాల్ టోర్నమెంట్ ఏర్పాటు, బోరంచ గ్రామంలో సాంఘిక, క్రీడా ఉత్సాహాన్ని ప్రతిఫలింపజేసింది.

# అమ్మ ఒడికి చేరకముందే అనంత లోకానికి పూజా

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 13జనవరి సంగారెడ్డి జిల్లా**

నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని మానూర్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పూజా అనే విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. నారాయణఖేడ్ మండలం పరిధిలో ర్యాకల్ గ్రామానికి చెందిన తిమ్మపూరం పూజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువు పూర్తి చేసి, ప్రస్తుతం బాసరలోని ట్రిపుల్ ఐటీలో ఉన్నత చదువులు కొనసాగిస్తోంది. సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవుల నిమిత్తం హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన నారాయణఖేడ్‌కు ఆర్టీసీ బస్సులో వస్తున్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సంగారెడ్డి మండలం పరిధిలోని వైకుంతపురం గ్రామ సమీపంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న ఫ్లెక్సీలు తరలిస్తున్న ఒక ఆటో ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఫ్లెక్సీల సీకు ఆర్టీసీ బస్సులోకి దూసుకువచ్చింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన పూజా అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో తిమ్మాపూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పండుగకు ఇంటికి వస్తూ మృతి చెందడం గ్రామస్తులను కన్నీటిపర్యంతం చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. పూజా మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి



గురయ్యారు. విద్యలో ప్రతిభావంతురాలిగా పేరొందిన పూజా అకాల మరణం తీరని లోటుగా మారింది.

# మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ జెడ్పీ చైర్మన్ జయపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి


సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 13 జనవరి సంగారెడ్డి జిల్లా



నారాయణఖేడ్ మున్సిపాలిటీలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించగా, ఈ సమావేశంలో మాజీ జెడ్పీ చైర్మన్ జయపాల్ రెడ్డి , నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల కోసం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రతి వార్డులో బీఆర్ఎస్‌ను బలోపేతం చేయాలని సూచిస్తూ, ఖేడ్ మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, మండల పార్టీ అధ్యక్షులు పరమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్ బుజ్జి, మాజీ ఎంపిటిసి ముజామిల్, మాజీ కౌన్సిలర్లు అభిషేక్ షెత్కార్, విఠల్, మాజీ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు లయక్, అంబాదాస్, ఉబేద్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్, నాయకులు సతీశ్ దేశ్ముక్, కొమ్ము శేఖర్, అబ్బు, దుర్గయ్య, నర్సింలు, నాగరాజు, కిరణ్ రావు పాటిల్, అశోక్ రెడ్డి, తుకారాం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వస్త్రాతరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 13జనవరి సంగారెడ్డి జిల్లా



నారాయణఖేడ్ పట్టణంలోని జీవన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సంతోష్ రెడ్డి గారి కూతురి నూతన వస్త్రాతరణ కార్యక్రమానికి నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయంగా ముచ్చటించి శుభాకాంక్షలు అందజేయగా, కార్యక్రమంలో సంతోష్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కాలనీ పోచమ్మ ఆలయంలో కొత్త ఆకాశదీపాల ఏర్పాటు

**- బిజిలీపూర్ గ్రామంలో అభివృద్ధి దిశగా ముందడుగు**

సందేశం టైమ్స్:అందోల్ నియోజకవర్గం ప్రతినిధి 13 జనవరి సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం



బిజిలీపూర్ గ్రామపంచాయతీ ప్రతిరోజు అభివృద్ధి పనుల్లో ముందడుగు వేస్తూ ప్రజలకు కావలసిన సేవలను అందిస్తున్న గ్రామ సర్పంచ్ నాగమణి నర్సింలు ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీ పోచమ్మ టెంపుల్ వద్ద కొత్త ఆకాశదీపాలను వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప సర్పంచ్ శోభా మచ్చేందర్, మాజీ ఎంపీటీసీ సదానందం, స్థానిక వార్డు నాయకులు, వట్ పల్లి మండల మైనార్టీ అధ్యక్షులు, నాయకులు షాబుద్దీన్, మొగులయ్య, మల్లేశం, అశోక్, యాదగిరి, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్గొని ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం పెరుగుతోంది

**ప్రభుత్వ హాస్పిటల్లోనే డాక్టర్ ప్రసవం**
**-- జిల్లా కలెక్టర్ ప్రశంసలు**

(సందేశం టైమ్స్) సూర్యాపేట, 13 జనవరి 2026 :



ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనే ఉద్యోగులు ప్రసవించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకం మరింత బలపడుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.నేరేడుచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయుర్వేద డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శృతి మంగళవారం ఉదయం నేరేడుచర్ల పీహెచ్‌సీలో పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ మంగళవారం రాత్రి పీహెచ్‌సీని సందర్శించి డాక్టర్ శృతిని అభినందించి, శిశువుకు బేబీ కిట్ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవల నాణ్యతను ఈ సంఘటన స్పష్టంగా చూపిస్తోందని అన్నారు. ప్రభుత్వ వైద్య సంస్థలపై ప్రజలు మరింత విశ్వాసం కలిగి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డాక్టర్ నాగిని, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి సంబరం.. ప్రకృతికి వందనం: భారతీయ జీవన తత్వానికి నిలువుటద్దం 'సంక్రాంతి'

**- సందేశం టైమ్స్ - ప్రత్యేక కథనం**
**- చీకటిని పారద్రోలి వెలుగును ఆహ్వానించే పండుగ**
**- రైతు కష్టానికి, సూర్యుని శక్తికి కృతజ్ఞత తెలిపే వేళ**


(సందేశం టైమ్స్ బ్యూరో - సూర్యాపేట/కోదాడ):

భారతీయ సంస్కృతిలో పండుగలు కేవలం వేడుకలు మాత్రమే కాదు, అవి ప్రకృతితో మనిషికి ఉన్న అవినాభావ సంబంధానికి ప్రతీకలు. అటువంటి వాటిలో అత్యంత విశిష్టమైనది, 'పెద్ద పండుగ'గా పిలవబడే మకర సంక్రాంతి. సూర్యుడు ధనుస్సు రాశి నుండి మకర రాశిలోకి ప్రవేశించే ఈ పుణ్యకాలం, చీకటి (దక్షిణాయనం) తగ్గి వెలుగు (ఉత్తరాయణం) పెరిగే శుభ ఘడియలకు నాంది పలుకుతుంది. పంటలు చేతికొచ్చి, రైతుల ఇళ్లు ధాన్యలక్ష్మితో కళకళలాడే ఈ సమయం.. సూర్యుడికి, నేలతల్లికి, పశు పక్ష్యాదులకు కృతజ్ఞత తెలిపే మహోత్సవంగా నిలుస్తుంది. తెలుగు లోగిళ్లలో నాలుగు రోజుల సందడి



shutterstock.com - 2568402761

తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతిని నాలుగు రోజుల పాటు వైభవంగా జరుపుకుంటారు. భోగి: తొలిరోజు భోగి మంటలతో పాత వస్తువులను, మనసులోని పాత ఆలోచనలను, చెడు అలవాట్లను దహించి, కొత్త ఆశలతో జీవితాన్ని ప్రారంభించడమే దీని పరమార్థం. పిల్లలకు రేగుపండ్లు పోసి దిష్టి తీయడం ఆనవాయితీ. ⊡ మకర సంక్రాంతి: ఇది ప్రధాన పండుగ. కొత్త బియ్యం, బెల్లంతో పొంగలి, అరిసెలు వండి సూర్య భగవానుడికి నైవేద్యం సమర్పిస్తారు. ఆడపడుచుల ముగ్గులు, గొబ్బెమ్మలు, ఆకాశంలో రంగురంగుల గాలిపటాలు కుటుంబ ఆనందాన్ని రెట్టింపు చేస్తాయి. ⊡ కనుమ: వ్యవసాయంలో రైతుకు చేదోడు



వాదోడుగా నిలిచే మూగజీవాల పండుగ ఇది. ఆవులను, ఎద్దులను, వ్యవసాయ పనిముట్లను అలంకరించి పూజించడం ద్వారా రైతు తన కృతజ్ఞతను చాటుకుంటాడు. ⊡ ముక్కనుమ: కనుమ తర్వాతి రోజు ముక్కనుమగా జరుపుకుంటారు. మాంసాహార విందులు, గ్రామ దేవతల ఆరాధనతో పల్లెలు పులకించిపోతాయి.కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు..పేర్లు వేరైనా భావం ఒక్కటే. దేశమంతటా ఈ పండుగను భిన్న రీతుల్లో జరుపుకుంటారు. తమిళనాడులో 'పొంగల్'గా, పంజాబ్‌లో 'లోహ్రి'గా, అస్సాంలో 'మాఘ్ బిహు'గా, గుజరాత్‌లో 'ఉత్తరాయణ్'గా, కర్ణాటకలో 'మకర సంక్రమణ'గా పిలుస్తారు. ప్రాంతం ఏదైనా సూర్యుడిని ఆరాధించడం, కొత్త పంటను స్వాగతించడం అనే భారతీయ ఆత్మ ఒక్కటేనని ఈ పండుగ చాటిచెబుతుంది.ఆధ్యాత్మికం - శాస్త్రీయం పురాణాల ప్రకారం భీష్ముడు ఉత్తరాయణ పుణ్యకాలం కోసం వేచి చూసి, ఇదే రోజున దేహత్యాగం చేసి మోక్షం పొందాడని ప్రతీతి. అలాగే గంగాదేవి భూమిపై అవతరించిన రోజు కూడా ఇదేనని నమ్మకం. శాస్త్రీయంగా చూస్తే, సూర్యరశ్మి పెరగడం వల్ల జీవరాశిలో కొత్త శక్తి నిండుతుంది.ముగింపు మనిషి మనుగడ ప్రకృతిపైనే ఆధారపడి ఉందనే సత్యాన్ని గుర్తుచేయడం, సమాజానికి అన్నం పెట్టే రైతును గౌరవించడం, కుటుంబ బంధాలను బలపరచుకోవడం సంక్రాంతి మనకు నేర్పే పాఠం. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, కోడి పందెలు వంటి గ్రామీణ క్రీడలు మన మూలాలను గుర్తుచేస్తాయి. పాత బాధలను వదిలి, కొత్త ఆశలతో ముందుకు సాగాలని నేటి యువతకు సందేశం ఇస్తూ.. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు.

# ఉల్లి రైతుల సమస్యలపై GMR ఫౌండేషన్ చైర్మన్ గుజ్జుము మచ్చేందర్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ వినతిపత్రం

**- తక్షణ చర్యలు తీసుకోవాలి గుజ్జుము మచ్చేందర్ డిమాండ్**

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 13జనవరి సంగారెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ఉల్లి రైతులు పెరిగిన విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీ ఖర్చులతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, పంటకు గిట్టుబాటు ధరలు లేక నష్టాల్లో కూరుకుపోతున్నారని బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, ఫౌండేషన్ చైర్మన్



మచ్చేందర్ గారి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశం రాజకీయమేమీ కాదని, రైతు బతుకుల కోసం సాగుతున్న న్యాయమైన పోరాటమని స్పష్టం చేస్తూ సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.




ప్రస్తుతం మార్కెట్లో ఉల్లి ధరలు తీవ్రంగా పడిపోయి క్వింటాలుకు రూ.720 కూడా రావడం లేదని, కనీస మద్దతు ధర ప్రకటించకపోతే ఉల్లి సాగు పూర్తిగా నష్టసాధనమవుతుందని హెచ్చరించారు. ప్రతి మండలంలో నిల్వ గిడ్డంగులు లేకపోవడం వల్ల రైతులు దళారుల చేతుల్లో నష్టపోతున్నారని, ఉల్లి ఎగుమతులపై కేంద్రం విధించిన ఆంక్షలను వెంటనే ఎత్తివేసి, రాష్ట్ర ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేపట్టి రైతును ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని మచ్చేందర్ స్పష్టం చేశారు.

# పల్వట్ల గ్రామంలో ముగ్గుల పోటీలు

**- సంక్రాంతి పండుగా వేడుకలు ఘనంగా నిర్వహించరు**

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 13జనవరి

సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల పరిధిలోని పల్వట్ల గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించగా, గ్రామ సర్పంచ్ రాణి మహిపాల్ రెడ్డి సమక్షంలో మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని సంబరాలకు ప్రత్యేక కళను జోడించారు. మొత్తం 20 మంది మహిళలు పోటీల్లో పాల్గొనగా, ప్రథమ బహుమతిని చెల్మడ అశ్విని



రూ.5,000 నగదు బహుమతితో, ద్వితీయ బహుమతిని అడ్డికే సంగీత రూ.2,500తో, తృతీయ బహుమతిని రాజేశ్వరి రూ.1,500తో గెలుచుకోగా, మిగతా 17 మందికి రూ.500 చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వట్పల్లి ఎస్ఐ లవ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి పండుగ కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యం వల్ల గ్రామానికి " సంక్రాంతి"పండగ మంచి గుర్తింపు వస్తుందని అభినందించగా, ఆయనను ఆత్మ కమిటీ డైరెక్టర్ సాయి బాబ, మహిపాల్ రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ పెద్ద గొల్ల సాయిబాబా, ఉప సర్పంచ్ రేగోటి భారతమ్మ--బసవరాజ్, న్యాలకంటి శ్రీనివాస్ రెడ్డి, బాణాపురం నాగరాజు, చల్మడ రాజు, యాదప్ప, నేలచెరువు మల్లప్పతో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగల ద్వారా గ్రామ ఐక్యత, సంస్కృతి మరింత బలపడుతుందని చాటారు.

# బహిరన్ దిబ్బలో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

సందేశం టైమ్స్:



నారాయణఖేడ్ నియోజకవర్గం ఇంచార్జి 13జనవరి బహిరన్ దిబ్బ గ్రామంలో సర్పంచ్ వీరప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు పల్లె సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఘనంగా జరిగాయి. తెలుగు లోగిళ్ల అందాలను గ్రామ గడ్డపై ఆవిష్కరించేలా మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని రంగుల ముగ్గులతో సంక్రాంతి పండుగ వాతావరణాన్ని ముందుగానే తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి సంబురాల్లో మహిళల భాగస్వామ్యం అభినందనీయమని, నేటి తరానికి మన సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను తెలియజేయడంలో ఇలాంటి



ముగ్గుల పోటీలు కీలకమని పేర్కొన్నారు. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా చిత్రాలతో వేసిన ముగ్గులు ఎంతో ఆకట్టుకున్నాయని ప్రశంసిస్తూ, ముగ్గులు వేసిన మహిళలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి గ్రామ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షురాలు సౌమ్య సురేష్ గౌడ్, సర్పంచ్ వీరప్ప, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, విశ్వేశ్వర్ పటేల్, మృత్యుంజయ్ పటేల్, చెన్నప్ప, పాపయ్య, బక్కన్న, అంజయ్య, శ్రీకాంత్, నర్సింలు, స్వరూప, వీరమని తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.